ప్రజాశక్తి
శుక్రవారం 10 మార్చి 2023
5
అల్లూరి సీతారామరాజు

## ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణపై నిరసన

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.శాంత కుమారి ఆదేశాల మేరకు మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు యూనియన్ బ్యాంక్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ డెలిగేట్ సభ్యుడు పి.చిన్నస్వామి మాట్లాడుతూ. గత ప్రధానమంత్రులైన నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలు ఎల్ఐసి, రైల్వే, స్టీల్ ప్లాంట్‌తో పాటు విమాన రంగాలు, ఇతర సంస్థలను ప్రభుత్వ పరం చేసి అభివృద్ధి పరిస్తే ప్రస్తుత బిజెపి కేంద్ర ప్రభుత్వం ఈ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరణ చేస్తుందన్నారు. వీటిని అదాని, అంబానీ వంటి కార్పొరేట్ బడా బాబులకు కట్టబెడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పోతురాజు, దయానిధి, భీమరావు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న నాయకులు

# ఎమ్మెల్సీ పోలింగ్‌కు సన్నద్ధం

▸▸ జిల్లాలో 15 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ▸▸ జిల్లా కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సామగ్రి ▸▸ స్ట్రాంగ్ రూమ్‌కు పటిష్ట భద్రత

ప్రజాశక్తి-పాడేరు: ఈ నెల 13న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పట్టభద్రుల శాసనమండలి నియోజక వర్గ ఎన్నికలు జరుగనున్న విషయం విదితమే. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11 మండలాలలో ఈ ఎన్నికకు సంబంధించి 15 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసారు. 11 మండలాలలో 11 పోలింగ్ కేంద్రాలతో పాటు హుకుంపేట, జి.కే వీధి, పాడేరు, అరకులలో అదనంగా ఒక్కో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసారు. జిల్లాలో పురుష ఓటర్లు 7861 మంది, మహిళా ఓటర్లు 3661 మంది నమోదు చేసుకోగా ముగ్గురు ఇతర ఓటర్లతో కలిపి 11525 ఓటర్లు నమోదు అయ్యారు.

జిల్లాలో అత్యధికంగా 1714 మంది హుకుంపేట మండలం కాగా అత్యల్పంగా 440 మంది జి.కే.వీధి మండలంలో ఓటర్లు ఉన్నారు.పోలింగ్ కేంద్రాల వారిగా పరిశీలిస్తే పెదబయలు జిల్లా పరిషత్ ఉన్నత పాటశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 1186 మంది, జి.కే.వీధి మండలం అప్పర్ సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో అత్యల్పంగా 56 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

ఈ 11 మండలాలను సౌకర్యార్థం ఐదు జోన్లు, ఐదు రూట్లుగా విభజించడం జరిగింది.జోన్-1 రూట్ 1 పరిదిలో హుకుంపేట, డుంబ్రిగుడ, అరకు లోయ, అనంతగిరి మండలాలు, జోన్-2 రూట్ 2 పరిదిలో పెదబయలు, ముంచింగిపుట్టు, జోన్-3 రూట్ 3 పరిదిలో చింతపల్లి, కొయ్యూరు, జోన్-4 రూట్ 4 పరిదిలో జి.కే. వీధి, జోన్-5 రూట్ 5 పరిదిలో పాడేరు, జి.మాడుగుల మండలాలు ఉన్నాయి.

ఇప్పటికే బ్యాలెట్ పేపర్లతో సహా ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ పెట్టెలు జిల్లాకు చేరుకున్నాయి. ఎన్నికల సిబ్బందికి అవసరమైన శిక్షణా తరగతులు జరుగుతున్నాయి. తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్, రిసేప్షన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 12వ తేదీ ఉదయం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి ఎన్నికల సిబ్బందిని, మెటీరియల్‌ను సంబంధిత పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 13వ తేదీ సాయంత్రం పోలింగ్ అనంతర మెటీరియల్ తీసుకోవడానికి కుడా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసారు. ఓట్ల లెక్కింపు కేంద్రమైన స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంకు సీల్డ్ బ్యాలెట్ బాక్స్‌లు చేరవేసే వరకు తలారిసింగి పాఠశాలలో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లో కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉంచి ఓట్ల లెక్కింపు కేంద్రానికి తరలించటానికి జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టింది.


ఎన్నికల బ్యాలెట్ పేపర్లు, మెటీరియల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

## వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అడ్డతీగల

స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు అందుతున్న వైద్య సేవలో వైద్య సిబ్బంది ఎటువంటి నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించినా కఠిన చర్యలు తీసుకుంటామని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. గురువారం సాయంత్రం ఆమె కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా సందర్శించి వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక ఆసుపత్రిలో కొన్ని ఎమర్జెన్సీ కేసుల పట్ల సిబ్బంది నిర్లక్ష్య వైఖరిగా ఉంటున్నట్లు ఫిర్యాదులు అందాయని వెల్లడించారు. తన సొంత మండలంలో వైద్య సేవలు ఈ విధంగా కొనసాగితే సిబ్బంది నిర్లక్ష్యంపై లోతుగా విచారణ జరపాల్సి ఉంటుందని హెచ్చరించారు. చాలామంది సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావడం లేదని పలువురు ఆరోపిస్తున్న విషయాన్ని సిబ్బంది దృష్టికి తీసుకొచ్చారు. డాక్టర్ అనూష మాట్లాడుతూ ఆసుపత్రి ఆవరణలో పేరుకుపోయిన తుప్పలను తొలగించాలని, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని, మంచినీటి వసతులను మెరుగుపరచాలని ఎమ్మెల్యే ధనలక్ష్మికి విన్నవించారు. ఈ సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై అప్పలరాజు, వైసిపి నాయకులు సామిదాల రాజా రమేష్, అడపా పెద్దకాపు ఎంపీటీసీ వడ్లమూరి రత్నం, నిమ్మల శీను, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగులకు మద్దతుగా సిపిఎం నిరసన

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:తమ హక్కుల కోసం ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేస్తున్న పోరాటానికి రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకట్ట వేసి వేధింపులకు గురి చేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యుల ఎస్‌బి పోతురాజు విమర్శించారు. గురువారం డుంబ్రిగూడ మండల కేంద్రంలో సిపిఎం, సిపిఐ రాష్ట్ర కమిటీలు పిలుపు మేరకు నాలుగు రోడ్లు జంక్షన్ వద్ద నిరసన తెలుపుతూ మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో పరిపాలిస్తున్న వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని, ఇటువంటి ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదన్నారు .కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు జీతాలు లేక అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు ప్రభుత్వం విధానాలతో ఆత్మహత్యలకు సిద్ధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతంలో గిరిజనులకు 100 శాతం ఉద్యోగాలు కల్పించిన జీవో 3 రిజర్వేషన్‌ను పునరుద్ధించాలని డిమాండ్ చేశారు. గిరిజన చట్టాలు తుంగలో తొక్కి రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు ఇచ్చిందని, తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.తక్షణమే ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యవర్గ సభ్యులు టి సూర్యనారాయణ, పాంగి సత్యనారాయణ, కె.రామకృష్ణ, కిముడు రామచందర్, పాంగి మోహన్ దాస్, గొల్లూరి జగన్నాథం పాల్గొన్నారు.

ఆందోళన చేపడుతున్న సిపిఎం నేతలు

## డిఇఒ సలీం బాషా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమితులైన డాక్టర్ సలీం బాషా గురువారం పాడేరు లోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న రమేష్ బదిలీపై నెల్లూరు డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వెళుతున్నారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పిడిపిఈటి అసోసియేషన్ సభ్యులు కొత్తగా విధుల్లో చేరిన డీఈవో సలీం భాషను కలిసి సత్కారం చేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రెటరీ పాంగి సూరిబాబు, పిఈటి, పిడి, అసోసియేషన్ ప్రెసిడెంట్ సింహాచలం, ఎస్‌జిఎఫ్ఐ సభ్యులు కిల్లో అప్పలరాజు, తాంగుల సద్దు, పిఈటి పిడి అసోసియేషన్ సభ్యులు రామ నాయుడు, కోటి, జిన్ను, నాగేశ్వరరావు, సత్యవతి, పద్మ, తదతరులు పాల్గొన్నారు.

సీతమ్మ పాడె మోస్తున్న ఎస్ఐ రామకృష్ణ తదితరులు

## మావోయిస్టు నేత జగన్ తల్లి మృతి

### పోలీసుల ఆధ్వర్యాన అంత్యక్రియలు

ప్రజాశక్తి -సీలేరు

మావోయిస్టు పార్టీ నాయకుడు కాకూరు పండన్న అలియాస్ జగన్ తల్లి కాకూరు సీతమ్మ (80) గురువారం ఉదయం జీకే వీధి మండలం, దుప్పిలివాడ పంచాయతీ కొమ్ములవాడ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందింది. గ్రామస్తులు, సీతమ్మ కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఉన్నతాధికారి ఆదేశాల మేరకు సీలేరు ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో కొమ్ములవాడ వెళ్లి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. సీతమ్మ పాడెను ఎస్ఐ రామకృష్ణ, కానిస్టేబుల్ పడాల్ మోసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.10వేలు సీతమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు.

కొమ్ములవాడ గ్రామానికి చెందిన కాకూరు పండన్న అలియాస్ జగన్ మావోయిస్టు పార్టీకి ఆకర్షితుడై చిన్నతనంలోనే దళంలో చేరి సుమారు 30 సంవత్సరాలు గడుస్తుంది. ప్రస్తుతం జగన్ ఆంధ్ర ఒడిశా సరిహద్దు స్పెషల్ జోనల్ కమిటీ నాయకుడిగా కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. జగన్ తల్లి సీతమ్మకు ఆరుగురు సంతానం. ఇందులో ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు. చిన్న కుమారుడు జగన్ మావోయిస్టు దళంలో చేరగా, పెద్ద కుమారుడు కొంత కాలం క్రితం అకాల మరణం చెందారు. ఆడపిల్లలు వారి వారి అత్తవారి ఇళ్ల వద్ద ఉంటున్నారు. దీంతో సీతమ్మ ఒంటరిగా ఉండేది. ఆమె అలనా పాలనా చేసే వాళ్లు లేకపోవడంతో సీతమ్మ కుమారుడు జగన్‌పై బెంగపెట్టుకొని అనారోగ్యానికి గురైంది. ఇటీవల సిఆర్‌పిఎఫ్ 42వ బెటాలియన్ సివిక్ యాక్షన్ ప్రోగ్రాం గొర్రెలోవలో నిర్వహించారు. ఈ క్రమంలో జగన్ తల్లి సీతమ్మ అనారోగ్యంతో ఉందని తెలుసుకున్న జికె.వీధి సిఐ అశోక్ కుమార్, ఎస్సై రామకృష్ణ, సిఆర్‌పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్ కొమ్ములవాడ వెళ్లి సీతమ్మను పరామర్శించారు. స్థానిక వైద్యాధికారి సౌమ్యతో వైద్య సేవలు అందించి, వంట సరుకులు, రగ్గు అందించారు. ఈ నేపథ్యంలో జగన్ మావోయిస్టు దళం నుంచి బయటికొచ్చి తన చెంతకు రావాలని పోలీసుల ద్వారా సీతమ్మ మొరపెట్టుకుంది.

**జగన్ కోసం పోలీసుల నిఘా**

తల్లి సీతమ్మ మృతి చెందడంతో ఆమె అంత్యక్రియలకు కుమారుడు జగన్ వస్తాడని భావించి పోలీసులు నిఘా పెట్టారు. జగన్ జనజీవన స్రవంతిలో కలవాలని పోలీసుల అనేకసార్లు పిలుపునిచ్చారు. తల్లి ద్వారా విజ్ఞప్తి చేయించారు. అయినా ఆయన జనజీవనం స్రవంతిలోకి రాకపోవడంతో పోలీసులకు జగన్ సవాల్‌గా మారాడు. కనీసం తల్లి అంత్యక్రియలకైనా హాజరవుతాడేమోనని పోలీసులు భావించి నిఘా పెట్టారు.

## విరబూసిన కంచెడి పూలు

-ఔషధ గుణాలు అధికం- శాకాహార కూరగా వంటకం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఏజెన్సీలోని కంచెడి పూలు విరగ్గాసాయి. గిరిజనులంతా ఈ సీజన్ లో ఈ పూలను సేకరించి శాకాహార కూర వంటకంగా వండుకుని అమితంగా తింటారు. తెలుపు, లేతవంగ రంగుల్లో వికసించే కంచెడి పూల చెట్లు అటవీ ప్రాంతాలతో పాటు రోడ్డు పక్కన, గిరిజన గ్రామాల సమీపంలోను ఏజెన్సీ వ్యాప్తంగా అధికంగా ఉన్నాయి. ఫిబ్రవరి నెలాఖరు నుంచి ఏప్రిల్ నెలాఖరు వరకు చెట్లకు కంచెడి పూలు విరగ్గాస్తుంటాయి. మంచి ఔషద గుణాలున్న శాకాహార వంటకంగా కంచెడిపూలకు ఏజెన్సీలో మంచి డిమాండ్ ఉంది. ఈ పూలను గిరిజనులు సేకరించి ఇగురు, వేపుడు కూరలుగా వండుతుంటారు. కొంత మంది గిరిజనులు ఈ కంచెడి పూలను వరుగులుగా తయారు చేసుకుని నిల్వ చేస్తుంటారు. ఎప్పుడు కంచెడి పూలు కూర తినాలనుకున్న ఈ వరుగులను నానబెట్టి ఆదేరోజు వండుతుంటారు. కంచెడి పూలలో పోషక విలువలు అధికంగా ఉంటాయని గిరిజనులు పేర్కొంటారు. ఈ కూరను ప్రతి ఏడాది ఈ సీజన్ లో తింటే రక్తశుద్ధితో పాటు మహిళలకు సంబంధించిన కొన్ని వ్యాధులు కూడా నయమవుతాయని పూర్వం నుంచి గిరిజనుల నమ్మకం. ఈ సీజన్‌లో ప్రతి గిరిజన కుటుంబం తప్పనిసరిగా కంచెడిపూలను కూరగా వండుకుని తినడం పూర్వం నుంచి ఆచారంగా మారింది. పూలతో కూర వంటకం అల్లూరి జిల్లా ఏజెన్సీలో ప్రత్యేకంగా నిలుస్తుంది. ప్రస్తుతం ఏజెన్సీ వ్యాప్తంగా ఎక్కడికక్కడ చెట్లకు కంచెడి పూలు విరగ్గాయడంతో వాటిని గిరిజనులు సేకరించి కూరగా వండుకుని ఇంటిల్లపాది తింటున్నారు. టమోటా, ఉల్లిపాయలు వేసి ఇగురు కూరగా కంచెడిపూలను వండడం గిరిజన మహిళలకు ఈ సీజన్ లో అలవాటుగా మారింది. ప్రతి గ్రామంలోను గిరిజనుల ఇంట కంచెడిపూల కూర గుమ గుమలాడుతుంది. కొంత మంది గిరిజనులను కంచెడి పూలను మొగ్గ, పూల దశలోనే చెట్ల నుంచి సేకరించి వారపుసంతలు, మండల కేంద్రాల్లో చిన్న వాటాను రూ.20ల ధరతో అమ్మకాలు జరుపుతున్నారు. కంచెడి పూల కూరకు ఏజెన్సీ వ్యాప్తంగా ప్రత్యేకత నెలకొంది.

కంచెడి పూల చెట్టు

### కంచెడి పూల కూరంటే ఇష్టం

తన చిన్నతనం నుంచి కంచెడి పూల కూరను ప్రతి ఏడాది తింటున్నాను. ఇంట్లో తల్లిదండ్రులు కంచెడి పూల కూరను వండి తనకు అధికంగా తినిపించే వారు. మంచి రుచికరంగా ఈ పూల కూర ఉంటుంది. వరుగులుగా తయారు చేసి వాటిని కూడా ఎప్పటికప్పుడు వండేవారు. ఈ కూర తింటే రక్త శుద్ధి జరుగుతుందని పెద్దలు చెప్పేవారు. టమాటతో ఇగురు కర్రీ ఎంతో రుచికరంగా ఉంటుంది.

**కంబిడి అమరావతి**
**గూడ గ్రామం, హుకుంపేట మండలం**

# అటవీ ఉత్పత్తులతో ఆదివాసీలకు ఆదాయం

- తునికి పళ్లు సేకరించి విక్రయిస్తున్న గిరిజనులు
- మెరుగైన ఆరోగ్యానికి అటవీ ఫలాలు దోహదం

ప్రజాశక్తి-చింతూరు

ఆదిమ కాలం నుండి అడవి బిడ్డలకు అటవీ ఉత్పత్తులే జీవనాధారం. సీజన్ వారీగా అటవీ ఫలసాయం, ఉత్పత్తులను సేకరిస్తూ ఆహారంగా ఉపయోగించుకోవడంతో పాటు వాటిని విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తూ ఉంటారు. ప్రస్తుతం చింతూరు అడవులు దొరకే తునికి పళ్లను గిరిజనులు సేకరించి రోడ్డు పక్కన విక్రయిస్తున్నారు.

చింతూరు ఏజెన్సీ బీడి ఆకు (తునికాకు) ప్రసిద్ధి. ఇక్కడి గిరిజనులకు తునికాకు రెండో ఆదాయ వనరు. బీడి తయారీకి ఉపయోగించే తునికాకును అడవిలో సేకరించి విక్రయిస్తూ ఆదాయం పొందుతారు. అంతే కాకుండా తునికి చెట్లకు కాసే పండ్లను సేకరించి విక్రయించి ద్వారా కూడా గిరిజనులకు ఆదాయం లభిస్తుంది. ప్రస్తుతం ఆదివాసీలు ఇంటిల్లపాది వేకువ జామునే లేచి అడవిలో లభించే తునికి పండ్లను సేకరించి బుట్టలలో వేసుకొని రహదారి పక్కన కుప్పలుగా పోసి విక్రయిస్తున్నారు. ఈ సీజన్లో విరివిగా లభించే తునికి పండ్లు తినడం వలన మంచి పోషక విలువలు అందడంతో పాటు అనేక రకాల రుగ్మతల నుండి కాపాడబడే అవకాశం ఉంది. అటవీ ఫల సాయంలో లభించే ప్రకృతి సిద్ధ పోషకాలు ఎంతో మేలు చేస్తాయనడంతో అతిశయోక్తి లేదు. తునికి పండ్లతో పాటు ఉసిరికాయలు, ఆయుర్వేద వైద్యానికి ఉపయోగించే కరక్కాయలు, తాండికాయలు, ముష్టి గింజలు వంటి వాటిని కూడా గిరిజనులు సేకరిస్తారు. అడవిలో విష సర్పాలు, క్రూర మృగాలు బారినుండి తప్పించుకుంటూ ఎంతో నేర్పుతో ఈ అటవీ ఫల సాయాన్ని సేకరిస్తూ ఉంటారు.

అయితే అడవులు నరికివేతతో ఈ అటవీ ఫలసాయాలు క్రమక్రమంగా అంతరించిపోయే దశకు చేరుకున్నాయి. కొండ చీపుర్లు, తేనెతో పాటు ముష్టి గింజలు, నేలవేమి, గడ్డి చామంతి, పెన్నేరు గడ్డ, వాకుడు వేళ్ళు, తిప్పతీగ, నేరేడు చెక్క, వావిలాకు వంటి పలు రకాల ఔషధ మొక్కలు అంతరించిపోతున్నాయి. ఈ ఔషధ మొక్కలు ఆయుర్వేద వైద్యానికి ఎంతో దోహదం చేస్తాయి. ఆయుర్వేద ఔషధ మొక్కలు అంతరించకుండా కాపాడాల్సిన బాధ్యత, వాటిని భావితరాలకు అందించాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఎంతైనా ఉంది. మంచి ఆరోగ్యానికి దోహదపడే అరుదైన పళ్ళను కాపాడుకోవాలి.

తునికి పళ్లను పోగులు వేసి అమ్ముతున్న గిరిజనులు

## వాహన తనిఖీలు ముమ్మరం

ప్రజాశక్తి- కొయ్యూరు : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొయ్యూరు ఎస్సై రాజారావు, మంప ఎస్సై లోకేష్ కుమార్ సూచించారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్ ఎదుట ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాలు నిలిపి రికార్డులను పరిశీలించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. ఈ చర్యలను ఎవరు అధికమించిన తగు చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

## అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి -కొయ్యూరు : మండల కేంద్రం కొయ్యూరు, సూరేంద్రపాలెం, శింగవరం గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో ఐసిడిఎస్ సిడిపిఒ విజయకుమారి గురువారం తనిఖీలు నిర్వహించారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలు, గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక దృష్టి సారించాలని అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. తక్కువ ఎత్తు, బరువు ఉన్న పిల్లల కొలతలు తీసుకోవాలన్నారు. ఇంటింటికీ తిరిగి గర్భిణులు, బాలింతలకు పోషకాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకత గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐసిడిఎస్ సిడిపిఒ విజయ కుమారి

## ఉదయ్ శ్రీనివాస్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - రంపచోడవరం

బెంగళూరు గాంధీ భవన్‌లో జరిగిన అమెరికన్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గిరిజన మిత్ర స్వచ్ఛంద సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఉదయ్ శ్రీనివాస్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ప్రోతిమా మధు కిషన్ చేతుల మీదగా ఉదయ్ శ్రీనివాస్ డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ గిరిజన మిత్ర సంస్థ సేవలను జాతీయ స్థాయిలో అందించాలన్నారు. స్నాతకోత్సవంలో కొరియాకు చెందిన శాంతి రాయబారులు జాసన్ ఛా, లిసా కిమ్, కర్ణాటకకు చెందిన శాంతి రాయబారులు డాక్టర్ స్టెల్లా, డాక్టర్ సత్యమూర్తి పాల్గొన్నారు.



డాక్టరేట్ అందుకుంటున్న గిరిజన మిత్ర మేనేజింగ్ డైరెక్టర్ ఉదయ్ శ్రీనివాస్

# పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలి

అరకులోయలో సిఐటియు, ఐద్వా నేతల ప్రచారం

హుకుంపేటలో గిరిజన సంఘం, సిపిఎం నేతల ప్రచారం

ప్రజాశక్తి -హుకుంపేట: పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ గెలుపుతోనే గిరిజన సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మండల పరిషత్ వైస్ ప్రెసిడెంట్ సూడిపల్లి కొండలరావు, గిరిజన సంఘం మండల కార్యదర్శి తాపల కృష్ణారావు, సిపిఎం మండల కార్యదర్శి వలసనేని లక్ష్మణరావు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని పెదగరువు బాలికోన్నత పాఠశాల, సూకూరు, అల్లంపుట్టు బాలుర ఉన్నత పాఠశాలలు, తీగలవలస పంచాయతీ బొడ్డాపుట్టు, చట్రాయిపుట్టు ప్రాథమిక పాఠశాలలు, సూకూరు రైతు భరోసా కేంద్రాల్లో పట్టభద్రులైన ఉద్యోగ ఓటర్లను కలిసి, రమాప్రభకు ప్రథమ ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. బిహెచ్‌పివి ఎంప్లాయిస్ యూనియన్ నేత నిక్కుల పాపారావు మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర ప్రజల సమస్యల పరిష్కారంలో, ముఖ్యంగా గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేయడం, వారి హక్కుల పరిరక్షణలో అన్ని ప్రధాన పార్టీలు విఫలమైన నేపథ్యంలో ఉద్యమ పార్టీలు, ప్రజాసంఘాల మద్దతుతో ప్రజాసమస్యలపై అవగాహన, పోరాడే మనస్తత్వం ఉన్న రమాప్రభకు గెలిపించాల్సిన అవసరం ఉందని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం అధ్యక్షుడు తడిగిరి వైస్ సర్పంచ్ కిల్లో రామారావు, గిరిజన నిరుద్యోగుల సంఘం నాయకులు ముదిలి కైలాస్, సీదరి చంద్రబాబు పాల్గొన్నారు.

**కొయ్యూరు** : అధికారం వైసిపి, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలు రెండూ దొందూ దొందేనని సీపీఎం మండల కార్యదర్శి సలుమర్తి సూరిబాబు అన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా సీపీఎం ఆధ్వర్యంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలో పలువురు

## కోరెడ్ల రమాప్రభ గెలుపుతోనే గిరిజన సమస్యలకు పరిష్కారం

### ఏజెన్సీలో ముమ్మర ప్రచారంలో ప్రజాసంఘాల నేతలు

పట్టభద్రులను కలిశారు. రమాప్రభను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

**ముంచింగిపుట్టు:** ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ బంగారుమెట్ట గిరిజన ఆశ్రమ పాఠశాలలు, సచివాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో లక్ష్మీపురం సర్పంచ్ కె త్రినాధ్ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. జిఒ 3 రద్దుతో ఏజెన్సీలోని గిరిజనులు వందశాతం ఉద్యోగావకాశాలు పొందే హక్కును కోల్పోయినా అధికార వైసిపితోపాటు బిజెపి, టిడిపి ఏ పార్టీలూ దీనిపై చట్టసభల్లో ప్రస్తావించి, పోరాడిన దిక్కు లేకుండా పోయిందన్నారు. ఈ నేపథ్యంలో ఉద్యమపార్టీలు, ప్రజాసంఘాల మద్దతులో పోటీలో ఉన్న పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ రమాప్రభను గెలిపిస్తే శాసనమండలిలో మనవాణి వినిపించే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎంఎం శ్రీను, జిల్లా ఉపాధ్యక్షుడు కె నర్సయ్య, నాయకులు పి రాందాస్, దోంబ్రు పి భీమరాజు పాల్గొన్నారు.

**అరకులోయ రూరల్:** ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ గురువారం ఐద్వా, సిఐటియు,గిఇరిజనన సంఘం ఆధ్వర్యంలో అరకులో కరపత్రాలను పంచుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు..ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు వివి జయ మాట్లాడుతూ అవకాశవాద రాజకీయాలు చేస్తూ, ఉత్తరాంధ్రకు తీరని అన్యాయం చేసిన వైసిపి, టిడిపి, బిజెపి అభ్యర్థులను ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో చిత్తుగా ఓడించి, తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణ, జిఒ 3 పునరుద్ధరణ, ఏజెన్సీకి ప్రత్యేక డిఎస్సి, హైడ్రో పవర్ ప్రాజెక్టుల రద్దు ఇతరసమస్యలపై పోరాటానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని కోరారు. ప్రచారంలో గిరిజన మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సన్యాసమ్మ, సిఐటియు మండల నాయకులు కొర్ర మగ్గన్న పాల్గొన్నారు.

**మారుమూల అంజలి శనివారంలో విస్తృత ప్రచారం**

**పాడేరు** : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ చింతపల్లి మండలం మారుమూల అంజలి శనివారం పంచాయతీలో గురువారం ఎపి గిరిజన సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కోనంగి చిన్నయ్య పడాల్ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. చిన్నయ్యపాలెం గ్రామంలో గిరిజన పట్టభద్రుల ఓటర్లతో సమావేశం నిర్వహించి, ప్రశ్నించి, పోరాడేతత్వం ఉన్న రమాప్రభకు ఓటేసి గెలిపిస్తే మన్యవాసులకు మేలు జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, సింహాచలం, చిన్నబ్బాయి పాల్గొన్నారు.

## వివాహ విందులో ఎన్నికల ప్రచారం

నూతన వధూవరులకు ఓటు అభ్యర్థిస్తున్న ప్రజాసంఘాల నేతలు

**పాడేరు**: ఉత్తరాంధ్ర పట్టభద్రులుఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ గురువారం ప్రజాసంఘాల నేతలు మండలంలో పలుచోట్ల ప్రచారం నిర్వహించారు. ఒక వివాహ విందు కార్యక్రమంలో కూడా పట్టభద్రులైన వధూవరులతో పాటు, అక్కడకు వచ్చిన పట్టభద్రుల ఓటర్లను కలిసి ప్రచారం చేశారు. సిఐటియు జిల్లా నాయకులు ఎల్. సుందరరావు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాలికి లక్కు, గిరిజన సంఘం నాయకులు నరేష్, దాస్ పాల్గొన్నారు

కొయ్యూరులో సిపిఎం నేతల ప్రచారం

ముంచంగిపుట్టులో గిరిజన సంఘం నేతల ప్రచారం

## రమాప్రభ గెలుపుతో ఉక్కు ఉద్యమం బలోపేతం

రమాప్రభకు సంఘీభావంగా విశాఖ ఉక్కు కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని విశాఖ ఉక్కు పట్టభద్రులకు కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన విభాగం వద్ద గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రజాతంత్రవాదులను మండలికి పంపిస్తే పేద, మధ్యతరగతి గొంతును, కార్మిక వాణిని వినిపిస్తారని చెప్పారు. స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటంలో భాగస్వామ్యమైన రమాప్రభ గెలుపు ఉద్యమం బలోపేతానికి దోహదపడు తుందన్నారు. జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, నిరంతరమూ ప్రజా సేవ చేస్తున్న రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉక్కు కార్మికులను అభ్యర్థించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ, రమాప్రభ గెలుపంటే విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమానికి మద్దతు ఇవ్వడమేనని పేర్కొన్నారు. ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి చిత్రాల సన్యాసిరావు మాట్లాడుతూ, విశాఖ ఉక్కులో ఉన్న పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించి ఉద్యమాలకు మద్దతు పలుకుతున్న రమాప్రభను గెలిపించి శాసనమండలికి పంపించాలని కోరారు. ఈ ప్రచారంలో డివిఆర్ఎస్ఐయు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, డిఐటియు నాయకులు సురేష్ కుమార్, సిపిఐ నాయకులు టి.కనకరాజు, ఎఐటియుసి నాయకులు రామకృష్ణ, రాజబాబు, సిఐటియు నాయకులు వైటి.దాస్, ఎం.రామారావు, డిసిహెచ్.వెంకటేశ్వరరావు, బి.అప్పారావు, నీలకంఠరావు, కెఎం శ్రీనివాసరావు, యూజ్ నాయకులు కామేశ్వరరావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**గాజువాక** : డాక్టర్ కోరెడ్ల రమాప్రభ గురువారం గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో లాయర్లను, ఉద్యోగులను, సిబ్బందిని కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. 72వ వార్డు కార్పొరేటర్, సీనియర్ న్యాయవాది ఎజె.స్టాలిన్,లాయర్లు ఎ.సీతామహాలక్ష్మి, బి.రామారావు, వెన్నెల ఈశ్వరరావు, శ్రీనివాసరావు, నిరంజన్, బి.సంతోష్‌కుమారి, సిపిఎం కార్యదర్శి ఎం.రాంబాబు, నాయకులు నగిరెడ్డి రామారావు, ఎస్.రాజేంద్రప్రసాద్, జి.స్టాలిన్, సిపిఐ జోన్ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ జివిఎంసి 67వ వార్డు పరిధిలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు కె.సంతోషం, వార్యా, నివాస్ నాయకులు డాక్టర్ ఎం.రమేష్‌కుమార్, కిరీటం పాల్గొన్నారు.

**కరాస:** డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని 90వ వార్డు పరిధి కాకానినగర్‌లో ఐద్వా నాయకులు ప్రభావతి ఆధ్వర్యాన ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, వై.సత్యనారాయణ, నీలిమ, ఎంవి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

**పెందుర్తి** : 97వ వార్డు పరిధి కార్మికనగర్‌లో రమాప్రభకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు రమణి మాట్లాడుతూ, శాసనమండలిలో ప్రజలు తరపున పోరాడేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనని చెప్పారు. పట్టభద్రులైన ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి ఉన్నతమైన వ్యక్తికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జగన్, ఐద్వా నేత రమణి, కాలనీ నాయకులు పాల్గొన్నారు.

**లీగల్ విలేకరి** : కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ యూనియన్ ఆధ్వర్యాన ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ హాజరై మాట్లాడారు. తనకు ఓటు వేసి గెలిపించాలని న్యాయవాదులను, కోర్టు సిబ్బందిని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు బివి.రామాజనేయరావు, ఐఎయల్ రాష్ట్ర అధ్యక్షులు కెఎస్ఎస్.సురేష్‌కుమార్ తదితరుల పాల్గొన్నారు.

**గోపాలపట్నం** : కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని తూర్పుగోదావరి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎం.వెంకటేశ్వరరావు పట్టభద్రులను కోరారు. గోపాలపట్నం సిఐటియు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. నాలుగేళ్ల అయినా డిఎస్‌సిని ప్రకటించలేదని తెలిపారు. సిపిఎస్ రద్దు చేస్తామని వాగ్దానం ఇచ్చి పట్టించుకోలేదన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేయగలిగేది పిడిఎఫ్ అభ్యర్థులేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ అధ్యక్షులు గుడివాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

**అచ్యుతాపురం** : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము ఆధ్వర్యాన గురువారం ప్రచారం చేశారు. అచ్చుతాపురం మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో ఉదయం వాకర్స్‌ను కలిశారు. ఈ సందర్భంగా పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ గురించి వారికి తెలియజేశారు.

**ఎంవిపి.కాలనీ** : కోరెడ్ల రమాప్రభను గెలిపించాలంటూ 18వ వార్డు అంజయ్య నగర్ కాలనీలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిడిఎఫ్ బృందం సభ్యులు జె.కోదండ, ఎం.చంటి, జి.సంతోష్, ఎన్‌వి.రమణ, జె.లక్ష్మి, జి.గీతాంజలి, కనక మహాలక్ష్మి, చందు, ప్రణయ్ పాల్గొన్నారు

## విశాఖ పోర్టు అఖిలపక్ష కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్యవేదిక మద్దతు

విశాఖ పోర్టు అఖిలపక్ష కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్యవేదిక మద్దతు

**కలెక్టరేట్** : పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు పోర్టు అఖిలపక్ష కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్యవేదిక మద్దతు తెలిపింది. విశాఖ పోర్టు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు ఆమెను గెలిపించుకోవాల్సిన అవసరముందని నాయకులు తెలిపారు.గురువారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐక్యవేదిక నాయకులు విఎస్.పద్మనాభరాజు (గౌరవ అధ్యక్షులు, యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ – సిఐటియు), బిసిహెచ్.మసేన్ (విశాఖ హార్బర్ అండ్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ – ఎఐటియుసి), ఎన్.కనకారావు (జాతీయ అధ్యక్షులు, జనతా పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ – సిఎఫ్‌టియుఐ), జి.చందు (అధ్యక్షులు, నేషనల్ పోర్ట్ ట్రస్ట్ ఎంప్లాయీస్ యూనియన్ – ఐఎన్‌టియుసి), బి.రామారావు (ప్రధాన కార్యదర్శి, విడిబిఎల్ అండ్ సిహెచ్‌డి పెన్షనర్స్ సంక్షేమ సంఘం), బి.లక్ష్మణరావు (ప్రధాన కార్యదర్శి, విడిఎల్‌బి అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ – సిఐటియు) మాట్లాడారు. రమాప్రభ గెలుపు కోరుతూ రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. విశాఖ పోర్టు రక్షణ కోసం కార్మిక సంఘాలు పోరాడుతుంటే మద్దతుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమే ప్రత్యక్షంగా పోరాటాల్లోకి వచ్చారన్నారు. మిగిలిన రాజకీయ పార్టీలు మద్దతు తెలపలేదన్నారు. రమాప్రభ గెలుపొందితే ప్రభుత్వ రంగ సంస్థలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఆమెకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు బి.జగన్, సత్యన్నారాయణ, రామలింగేశ్వరావు, ఎల్లారావు, నర్సింగరావు పాల్గొన్నారు.

## పశువుల వ్యాధులపై అవగాహన అవసరం

**జిల్లా వెటర్నరీ అధికారి డాక్టర్ స్వామినాయుడు**

పశువుల వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ స్వామినాయుడు

ప్రజాశక్తి -హుకుంపేట: పాడి, పశువుల పెంపకందారులుగా వాటి ఆరోగ్యం, వాటికి వచ్చే వివిధ రకాల వ్యాధులు, నివారణ చర్యలు, వ్యాక్సినేషన్ ఇతర అంశాలపై రైతులకు అవగాహన అవసరమనిజిల్లా పశు సంవర్థక శాఖాధికారి డాక్టర్ స్వామినాయుడు అన్నారు. గురువారం మండలంలోని కొట్నాపల్లి పంచాయతీ మత్స్యపురం తదితరగ్రామాల్లో నాలుగునెలలు పైబడిన పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేసే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా పశువిజ్ఞానబడి నిర్వహించి, గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. పశువులు అస్వస్థతకు గురైనా, ఎటువంటి వ్యాధి సోకినా వెంటనే దగ్గరలోని పశు వైద్యాలయానికి వెళ్లి వైద్యులు, సిబ్బందిని సంప్రదించి, తగు చికిత్స చేయించాలని సూచించారు. పశువులకు ఏయే సీజన్‌లో ఎటువంటి వ్యాధులు వస్తాయో అవగాహన ఉంటుందని, అయితే వాటికి అందుబాటులో ఉండే టీకాలపైనా వెటర్నరీ వైద్యులు, సిబ్బందిని సంప్రదించి, ఎప్పటికప్పుడు వాటిని పశువులకు వేయించాలన్నారు. పశువుల వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ప్రాణనష్టం వస్తుందని, తద్వారా పెంపకందారులు ఆర్థికంగా నష్టపోతారని సూచించారు. పశువుల పెంపకం ద్వారా ఎన్నో ప్రయోజనాలున్నాయని, వాటి పేడ ద్వారా వచ్చే గత్తంతో సేంద్రీయ వ్యవసాయం చేసి, పంటలను పండిస్తే మన ఆరోగ్యానికి మేలు జరుగుతుందన్నారు. పంటల సస్యరక్షణకు పశువుల పేడ, మూత్రంతోనూ జీవ రసాయనాలను తయారుచేసి తెగుళ్లు, చీడపీడలను నుంచి పంటలను రక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో హుకుంపేట వెటర్నరీ డాక్టర్ కె.చరణ్, సచివాలయ వెటర్నరీ అసిసెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై చర్యలు

**ధారకొండ పిహెచ్‌సిని ఐటిడిఎ పిఒ సందర్శన**

**గైర్హాజరైన డాక్టర్, సీనియర్ అసిస్టెంట్ జీతాలు నిలుపుదల**

**ఇద్దరు పారామెడికల్ సిబ్బందికి షోకాజ్ నోటీసులు**

పిహెచ్‌సి సందర్శనలో పిఒ గోపాలకృష్ణ.. పక్కనే రికార్డుల తనిఖీ

ప్రజాశక్తి -సీలేరు: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వైద్యులు, సిబ్బందిపై ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ కొరడా ఝళిపించారు. విధులకు డుమ్మా కొట్టిన ధారకొండ పిహెచ్‌సి వైద్యాధికారి నాగభూషణం, సీనియర్ అసిస్టెంట్ ఎన్‌విఎ నారాయణరావులకు మార్చి నెల జీతాలు నిలుపుదల చేయాలని ఆదేశించారు. అలాగే పిహెచ్‌సిలోని ఇద్దరు పారామెడికల్ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గురువారం దారకొండ పిహెచ్‌సిని పిఒ గోపాలకృష్ణ ఆకస్మిక తనిఖీ సమయానికి ఆసుపత్రిలో లేని డాక్టర్ నాగభూషణం, సీనియర్ అసిస్టెంట్లపై చర్యలకు ఆదేశించారు.మార్చినెల జీతాలు నిలుపుదల చేయాలని ఆదేశించారు. అలాగే ఎక్కడికి వెళ్లిందీ మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయక పోవడంపై ఎంపిహెచ్‌ఎ ఎం.ఈశ్వరమ్మ, వి. సుభాషిణిలకు వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

అనంతరం ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలపై డాక్టర్ హిమబిందును అడిగి తెలుసుకున్నారు. రోజువారీ అవుట్ పేషెంట్లు, నెలవారీగా నిర్వహిస్తున్న ప్రసవాలు, మందుల లభ్యత తదితర అంశాలపై ఆరా తీశారు. మందులు కొరత ఉంటే తన దృష్టికి తీసుకురావాలని డాక్టర్ హిమబిందుకు సూచించారు. ఆసుపత్రిలోని రికార్డులను తనిఖీ చేశారు. పిహెచ్‌సి వద్ద నిర్మిస్తున్న బర్త్ వెయిటింగ్ హాల్‌ను పరిశీలించి, నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండడంతో వేగవంతం చేసి పూర్తిచేయాలని డిఇని ఆదేశించారు అక్కడే శిధిలావస్థలో ఉన్న భవనాన్ని తక్షణమే తొలగించాలని సూచించారు. అనంతరం పెదవలసలో నిర్మించిన సిసి రోడ్డును, చింతపల్లిలోని ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డిఇ చాణక్య ఉన్నారు.

# ప్రారంభానికి ముందే శిథిలావస్థకు..!

- నిర్మించి, నిరుపయోగంగా వదిలేసిన గొడౌన్
- ఏడేళ్లకు పైగా ప్రారంభోత్సవానికి ఎదురుచూపులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- జిల్లాల పునర్విభజన తర్వాత కూడా అదే నిర్లక్ష్యం

ఏడేళ్లుగా ప్రారంభానికి నోచుకోని రాజేంద్రపాలెంలోని నిత్యావసర సరుకుల గొడౌన్

ప్రజాశక్తి -కొయ్యూరు : ఎంతఘోరం.. నిర్మాణం పూర్తయి దాదాపు ఏడేళ్లు గడిచినా నేటికీ ప్రారంభానికి నోచుకోని కొయ్యూరు నిత్యావసర వస్తువుల నిల్వ గిడ్డంగి భవన దుస్థితి... అధికారుల నిర్లక్ష్యానికి, ప్రజాప్రతినిధుల చిత్తశుద్ధి లేమికి నిలువుటద్దం. ప్రజాధనం వృథాయే తప్ప ప్రయోజనం కలగని రీతిలో, ప్రారంభోత్సవానికి నోచు కోకుండా నిత్యావసర సరుకుల గొడౌన్ శిథిలావస్థకు చేరుకుంటుందేమోనని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వివరాలివి.

కొయ్యూరు మండలంలోని జిసిసి, ఇతర రేషన్ డిపోలకు సరుకుల సరఫరాకు మండల కేంద్రంలోనే ఎంఎల్ఎస్ పాయింట్ ఏర్పాటు చేయాలన్న ప్రజలు విజ్ఞప్తికి ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వయంత్రాంగం కొయ్యూరులో కాకరపాడు, రాజేంద్రపాలెం మధ్యలో గొడౌన్ నిర్మాణానికి ఐటిడిఎ నిధులు మంజూరు చేశారు. ఐటిడిఎ ఆధ్వర్యంలో గిరిజన ఇంజినీరింగ్ శాఖ పర్యవేక్షణలో పనులు కూడా శరవేగంగా పూర్తయి, ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. దీంతో ఆప్పటివరకు మైదాన ప్రాంతంలోని గొలుగొండ మండలం కృష్ణదేవిపేట ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి కొయ్యూరుమండలంలోని జిసిసి రేషన్ డిపోలకు రేషన్ సరుకులు తీసుకు రావాల్సిన దుస్థితి, వ్యయప్రయాసలకు చెక్ పడుతుందని అందరూ భావించారు.

**ఎందుకు నిర్మించారో ..?**

నిత్యావసర సరుకుల నిల్వ, సరఫరాకు కొయ్యూరు మండలంలోనూ ఎంఎల్ఎస్ పాయింట్ ఉండాలన్న సత్సంకల్పంతో రాజేంద్రపాలెం వద్ద గొడౌన్ నిర్మించి, ప్రారంభానికి సిద్ధం చేసినా ఎందుకు దీన్ని వినియోగంలోకి తీసుకు రావడం లేదో ఎవరికీ అంతుపట్టడం లేదు. ఏడేళ్లుగా దీనివైపు కన్నెత్తి చూసే నాధులే లేకుండా పోయారు.

అసలు ఇలాంటి ఒక భవనాన్ని ప్రజాధనంతో నిర్మించామన్న గుర్తు అధికారులు, నేతల్లో ఉందా? అనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. అసలు ఈ భవనం ఎందుకు నిర్మించినట్లో, ఎందుకు నిరుపయోగంగా వదిలేసినట్లో? తెలియక మండలవాసులు అయోమయానికి గురవుతున్నారు. ఏళ్లతరబడి ప్రారంభానికి నోచుకోక శిథిలావస్థకు చేరుకుంటున్నా ఎందుకు పట్టించుకోవడం లేదో అంతుపట్టడం లేదు.

**జిల్లాల పునర్విభజన తర్వాతైనా...**

జిల్లాల పునర్విభజనకు ముందు వరకు ఒకే జిల్లా కదాయని సర్దుకుపోయే పరిస్థితి ఉన్నా, పునర్విభజన జరిగిన తర్వాత అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం నుంచి అల్లూరి జిల్లాలోని కొయ్యూరు మండలానికి నిత్యావసర సరుకులు సరఫరా జరుగుతున్నాయన్న విషయం అసలు అధికారులు, నేతలకు తెలుసాయని మండలవాసులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా విభజన తర్వాత కొయ్యూరు మండలంలోని జిసిసి, రేషన్ డిపోలకు అనకాపల్లి జిల్లా కృష్ణదేవిపేట ఎంఎల్ఎస్ పాయింట్ నుంచే రేషన్ సరుకులు సరఫరా జరుగుతున్న విషయం తెలుసుకునైనా ఈ భవనాన్ని వినియోగంలోనికి తెచ్చి, ప్రజా ధనానికి సార్ధకత చేకూర్చే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# వీధుల్లో శునకాలు.. ఇళ్లల్లో వానరాలు

- హడలిపోతున్న ప్రజలు.. పట్టని అధికారులు

స్కూల్ పిల్లల వెంట పడుతున్న వీధికుక్కలు

ప్రజాశక్తి -మారేడుమిల్లి : అల్లూరి జిల్లా మారేడుమిల్లి మండల కేంద్రంలో వీధి కుక్కలు, కోతుల బెడద ప్రజలను బెంబేలెత్తిస్తోంది. రోజురోజుకూ తీవ్రమౌతున్న వీటితో ప్రజలు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న వాటి బారిన పడి గాయాలపాలయ్యే దుస్థితి నెలకొంది. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులకు వీటి వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంది. పిల్లలు పాఠశాలలకు వెళ్లేటప్పుడు ఏ మూల నుంచి ఏ కుక్క వచ్చి కాటువేస్తుందో తెలియని స్థితిలో పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు రోడ్లపై వెళుతున్న వాహనాలపై గుంపులుగా ఉన్న వీధి కుక్కలు దాడిచేయడం, కొన్ని సందర్భాలల్లో వాటిని తప్పించబోతూ ప్రమాదాలకు గురైన ఘటనలు జరుగుతున్నాయి. దీంతో వీధుల్లో పిల్లలైనా, పెద్దలైనా ఒంటరిగా తిరగాలంటే భయపడే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

**ఇళ్లల్లో కోతుల బెడద...**

మరోవైపు కోతుల గుంపులు ఇళ్లల్లోకి ప్రవేశించి ఆహార పదార్థాలు, వంటసామగ్రి ఎత్తుకుపోవడం, పాడుచేయడం వంటి ఘటనలు నిత్యకృత్యమయ్యాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇళ్లలోకి చొరబడిన వాటిని తరిమేయాలని ప్రయత్నించినా, బెదిరించినా చిన్న, పెద్దా తేడా లేకుండా మీద పడి రక్కటం, కొరకటం వంటివి చేస్తున్నాయి. విద్యార్థులు, పాదచారులు వీటి బారిన పడి గాయాలైన సందర్భాలు ఉన్నాయి.

మైదాన ప్రాంతాల్లో సంచరించిన కోతులను అక్కడి నుంచి పట్టుకొచ్చి మారేడుమిల్లి సమీపాన వదిలేస్తుండడంతో అవి ఇక్కడ స్వైరవిహారం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయని స్థానికులు అంటున్నారు. రోడ్డు పక్కనే కోళ్ల వ్యర్థాలు, ఆహార పదార్థాలు పడేయడం వల్ల వాటిని తినడానికి అలవాటు పడిన కుక్కలు, కోతులు గుంపులుగా ఇక్కడే తిష్టవేసి ఉంటున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అటవీశాఖ, పంచాయతీ అధికారులు కోతులు, కుక్కల బెడద నుంచి తమకు విముక్తి కలిగించాలని మారేడుమిల్లి వాసులు కోరుతున్నారు.